# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

**MARCH - 2000**

# సంక్షిప్త వార్తలు

2000 సంవత్సరము జనవరి 31వ తేదీ సోమవారంనాడు తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలోని క్రీస్తు సంఘము వార్షికస్తుతి కూటమును ఏర్పాటు చేసిరి. దేవుడు కోరుకొండలోని సంఘమునకు, సంఘ సువార్తికులు కె. కొర్నేలియస్ గారికి, వారి కుటుంబమునకు చేసిన మేళ్ల నిమిత్తము కృతజ్ఞత కూటమునేర్పాటు చేయగా, స్థానికులు పరిసర సంఘ సభ్యులు పెక్కుసంఖ్యలో పాల్గొనిరి. సహోదరులు జాషువా గూటంగారు కూడ సతీసమేతముగా హాజరై జరిగిన రెండు కూటములలోను వాక్యపరిచర్య చేసిరి. కొర్నేలియస్ గారు, వారి కుమారులు కోరుకొండ ప్రాంతములో క్రీస్తుకొరకు మంచి పని చేయుచున్నారు.

2000 సంవత్సరము ఫిబ్రవరి 5వ తేదీనాడు ఉప్పలగుప్తం మండలం వాడపర్రు గ్రామములో జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు నేటీ సెయింట్‌గారు అధ్యక్షత వహించి కూటమును నడిపించిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వాడపర్రులో సోదరులు డి. రంగారావు గారు సంఘమునకు వాక్యపరిచర్య చేయుచు అనేకులను క్రీస్తులోనికి నడిపించుచున్నారు.

ఫిబ్రవరి 18వ తేదీనుండి 24వ తేదీవరకు అమెరికా సోదరుల లయల్ హారమ్స్‌గారు వారి కుమారుడు లేరీ హారమ్స్‌గారు భారతదేశ పర్యటనకు వచ్చి పలుప్రాంతములు దర్శించిరి. వారు సోమశిల, గుంటూరు, నందిగామ, ఇబ్రహీంపట్నం, పిప్పర, నడిపూడి గ్రామములలో ఏర్పాటు చేయబడిన కూటములలో క్లుప్తముగా వాక్యపరిచర్య చేసి సహోదరులను ప్రోత్సహించిరి. వారితోపాటు సోదరులు రోయస్ గారు కూడా ఆయా గ్రామములను దర్శించిరి. ఈ ప్రాంతములన్నిటిలోను పలువురు క్రీస్తు సువార్తకు లోబడిరి.

ఫిబ్రవరి నెల సువార్తికుల సదస్సు తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం (నల్లగుంట) లో 29వ తేదీ మంగళవారం నాడు

(తరువాయి 3వ కవరు పేజీలో)

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 20 మార్చి 2000 సంచిక 8


## మతాధికారము

### ( Authority in Religion )

ప్రపంచములో జరుగు ప్రతిక్రియ వెనుక ఒక చట్టమున్నది. ఒక కాంట్రాక్టరు బిల్డింగును కట్టుచున్న యెడల అతనికీయబడిన ప్లాను ప్రకారము దానినతడు నిర్మించవలెను. లాయరొకడు ఒక కేసును వాదించుచున్న యెడల అతడు చట్ట ప్రకారము వాదించవలెను. క్రీడాకారులు ఏదైనా ఆటను ఆడుచున్న యెడల వారు రూల్ ప్రకారము ఆడవలెను. నిజానికి మనము చేయు ప్రతి సంగతి కూడా ఏదో ఒక చట్టప్రకారము జరుగుచునే యున్నది. అట్టి క్రమబద్ధమయిన చట్ట ప్రకారము మనము జీవించలేని యెడల ఈ భూమిపై మన జీవితము దుర్లభమగును. చట్టబద్ధమైన జీవితాన్ని మానవులు జీవించలేని యెడల సమస్త పరిశ్రమలు, వాణిజ్యము, దేశ దేశాలమధ్య జరిగిన ఒప్పందములు, వినోదములు,

కోర్టులు ఆఫీసులు బడులు మొదలగునవన్నియును మూసివేయబడును. మానవులు చట్ట సంబంధమైన అధికారమునకు లోబడనప్పుడు భూమిపై గందరగోళము, గలిబిలి తప్ప మరొకటి ఉండదు. ఆత్మీయ సంబంధమైన విషయములలో కూడ మానవులు ఈ అధికారమునకు లోబడి నడచుకొనుట బహు ప్రాముఖ్యమైనది.

అయితే క్రైస్తవ్యములో మనము ఎవరి అధికారము చొప్పున నడుచుకొన వలెను ? ఆత్మీయ విషయములలో అనేకుల అధికారమునకు మనము లోబడిన యెడల గలిబిలి తప్ప మరొక గత్యంతరము మనకు కనపడదు. ఆత్మీయ విషయములలో కూడ ఏది మంచిదో, ఏది చెడ్డదో తెలియజేయు ప్రమాణము (Standard) మనకు అవుసరము. 'క్రైస్తవ లోకమును' ఈనాడు మనము గమనించిన యెడల అందు అనేక చీలికలు కన్పడుచున్నవి. క్రీస్తులోనే యున్నామని చెప్పుకొను అనేక సంఘములున్నవి. గాని వారు బోధించు సిద్ధాంతములలో ఒకదాని కొకటి పొసగదు. వారి ఆచారములు వేరు. ఇట్టి చీలికల వలన కలిగేది గందరగోళమే తప్ప మరొకటి కాదు. క్రైస్తవ్యములో యున్న చీలికలు చూచి ఇందులో ఏది సరియైనది ? నా ఆత్మరక్షణ కొరకు నేనెవరి అధికారమునకు లోబడవలెను ? అనే తలంపులు మీకును అనేకసార్లు రావచ్చును.

అన్ని విషయములలో వలె ఆత్మీయ విషయములో కూడ మనము సత్యమును బట్టి నడుచుకొనవలెను. నిజానికి లోకమంతయు సత్యాన్నే అన్వేషించుచున్నది. అసత్యాన్ని ద్వేషించుచున్నది. అనేకులు అబద్ధమాడి మనలను మోసగించవచ్చును. అందువలననే మనము సత్యాన్ని తెలిసికొనుట అతి ప్రాముఖ్యమైనది. అందుకే యేసు ఇట్లు చెప్పుచున్నాడు : "మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31,32).

గనుక ఆత్మీయ విషయములలో ఏది సరియైనదో మనము నిర్ణయించాలంటె సత్యమును ముందు మన మెరుగవలెను. దేవుని వాక్యమే సత్యము అని యోహాను 17:17లో యేసు చెప్పుచున్నాడు. యోహాను 14:6లో నేనే మార్గమును, సత్యమును, జీవమును అని యేసు చెప్పుచున్నాడు. గనుక క్రైస్తవ్యములో ఏది సరియైనదో మనము తెలిసి కొనాలంటే ముందు దేవుని వాక్యమును, యేసుక్రీస్తు బోధలను ఎరుగవలెను.

## క్రీస్తే సర్వాధికారి

మనము యేసుక్రీస్తు యొక్క ఆజ్ఞలను బట్టి నడుచుకొనవలెనని దేవుడు కోరుచున్నాడు. మన ఆత్మీయ మార్గదర్శిగా యుండు అధికారమును క్రీస్తు ఒక్కడు మాత్రమే కలిగియున్నాడు. యేసుక్రీస్తు బోధించుచుండగా ఆనాటి మత గురువులు ఆయన యొద్దకు వచ్చి ఏ అధికారము వలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు ? అని ప్రశ్నించిరి (మత్తయి 21:23). యేసు బోధించుచున్నప్పుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్య పడుచుండిరి. ఏలయనగా ఆయనవారి శాస్త్రులవలె గాక అధికారముగల వానివలె వారికి బోధించెను (మత్తయి 7:28,29). యేసుక్రీస్తుకు అధికారమును ఎవరు ఇచ్చెనో అనుదానికి మత్తయి 17:5లో దేవుడే జవాబిచ్చెను. యేసును చూపించుచు, "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి" యని తండ్రియైన దేవుడు సాక్ష్యమిచ్చెను. మనము యేసుక్రీస్తు మాటలకు లోబడవలెను. "ఏలయనగా దేవుడు తాను పంపినవానికి కొలతలేకుండ ఆత్మననుగ్రహించును గనుక ఆయన దేవుని మాటలే పలుకును" (యోహాను 3:34). అందువలననే "తండ్రియందు నేనును, నాయందు తండ్రియు ఉన్నామని నీవు నమ్ముటలేదా ? నేను మీతో చెప్పుచున్న మాటలు నాయంతట నేనే చెప్పుట లేదు" అని యోహాను 14:10లో యేసు బోధించెను.

యేసు చేసిన బోధలు, సూచక క్రియలు, అద్భుతములు అన్నియును యేసుక్రీస్తే సర్వాధికారి యని సాక్ష్యమిచ్చుచున్నవి. యేసుక్రీస్తు చనిపోయి తిరిగి లేచిన తరువాత "పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని ఆయన తన అపొస్తలుల కాజ్ఞాపించెను (మత్తయి 28:18-20). అందువలన యేసుక్రీస్తు ఆజ్ఞలే మనకు ఆధారము. ఆయన వాక్యమును బట్టియే మన విశ్వాసమును కొనసాగించవలెను. సమస్త జనులకు సువార్తను బోధించి, వారికి బాప్తిస్మమిచ్చి, వారిని శిష్యులనుగా చేయవలెనని యేసు తన అపొస్తలులను ఆజ్ఞాపించెను. యేసు యొక్క ఆజ్ఞలను సమస్తజనులు అపొస్తలుల ద్వారా వినవలెను.

## అపొస్తలుల బోధ అధికారయుక్తమైనది

యేసుయొక్క ఆజ్ఞలను బోధించు అధికారమును ఇప్పుడు పండ్రెండు అపొస్తలుల కీయబడినట్లు మనము గమనించాము. ఆ 12 అపొస్తలులు సత్యమునే బోధించులాగున వారిని సర్వసత్యములో నడిపించుటకు క్రీస్తు వారికి పరిశుద్ధాత్మను వాగ్దానము చేసెను. యేసు వారికి ఇట్లు చెప్పెను : "అయితే ఆయన, అనగా సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13).

యేసుక్రీస్తు పునరుత్థానుడైన తరువాత పెంతెకొస్తు అను పండుగ దినమున ఆ 12 మంది అపొస్తలులు పరిశుద్ధాత్మను పొందిరని మన మెరుగుదుము (అపొ.కా. 2:4). పరిశుద్ధాత్ముడు వారికేమయితే బయలు పరచెనో వాటిని అపొస్తలులు

ప్రజలకు బోధించిరి. జనులు, వారి బోధలను మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా దేవుని వాక్యమని అంగీకరించిరి (1థెస్స 2:13). యేసుక్రీస్తు పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులకు బయలుపరచగా, క్రీస్తు యొక్క చిత్తమును అపొస్తలులు ప్రజలకు బోధించిరి.

అపొస్తలులు యేసుక్రీస్తు యొక్క చిత్తమును సంపూర్ణముగా బోధించిరి. పరిశుద్ధాత్ముడు వారిని సర్వ సత్యములోనికి నడిపించెను. "దేవుని సంకల్ప మంతయు మీకు తెలుపకుండ నేనేమియు దాచుకొనలేదు" అని అపొస్తలుడైన పౌలు చెప్పుచున్నాడు (అపొ.కా. 20:27). అందువలన ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42). అపొస్తలులు బోధించినది తప్ప దానికి భిన్నమైన దానిని బోధించుటకు ఎవరికిని అధికారము లేదు. "మేము ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను మేమైనను, పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడువును గాక", అని పౌలు గలతీ 1:8లో బోధించెను.

క్రీస్తు సంఘము స్థాపించబడిన మొదటి దినములలో దేవుని వాక్యము అపొస్తలుల ద్వారా బయలుపర్చబడుచుండెను. ఆ వాక్యమును వారు ప్రజలకు బోధించిరి. అంతేకాదు, దేవుని చిత్తమును పరిశుద్ధాత్మ ద్వారా వారు క్రొత్త నిబంధన రూపమువ మనకు వ్రాసి యిచ్చిరి. క్రొత్తనిబంధనలో యేసుక్రీస్తు యొక్క ఆజ్ఞలు మనకు కన్పడును. అపొస్తలులును, మరికొందరు భక్తులును క్రొత్తనిబంధనను వ్రాయుచుండగా దేవుడు వారికి పరిశుద్ధాత్మావేశము ననుగ్రహించెను. "మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము" అని అపొ.పౌలు సాక్ష్యమిచ్చెను (1కొరింథీ 2:13). "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు

గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" యని అపొ.పేతురు సాక్ష్యమిచ్చెను (2పేతురు 1:21).

## లేఖనములు సర్వ సంపూర్ణములు

అందువలన మనలను దేవుని యొద్దకును, పరలోకమునకును నడిపించుటకు బైబిలు గ్రంథము ఒక్కటే సరియైనది. దైవావేశము వలన అది వ్రాయబడెను గనుక అది సంపూర్ణ మార్గదర్శియై యున్నది. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది" అని 2తిమో 3:16 చెప్పుచున్నది. ఈ సంగతిని గమనించుడి : మానవుని పరిపూర్ణునిగా చేయుటకు ఏమైతే అవుసరమో అదంతయు బైబిలునందున్నది. లేఖనములే సర్వ సంపూర్ణములు గనుక, ఆ లేఖనములే మానవుని పరిపూర్ణునిగా చేయును గనుక, ఆత్మీయ విషయములలో మానవులు లేఖనములనే అనుసరించవలెను గాని వేరొకనికాదు. లేఖనముల ప్రకారము లేని క్రియ ఏదైనను అది సత్క్రియ కానేరదు. లేఖనముల ప్రకారము కాని బోధ ఏమైనను అది సద్బోధ కాదు.

దేవుని చిత్తమంతయు బైబిలునందు, మరి ముఖ్యముగా క్రొత్త నిబంధన యందున్నది గనుక మనము లేఖనములను అనుసరించి నడుచుకొనవలెను.వాటికి మనము కలుపుట గాని, తీసివేయుట గాని చేయరాదు (ప్రకటన 22:18,19). బైబిలునందు వ్రాయబడిన క్రీస్తుబోధను తప్ప వేరొకదానిని బోధించుటకు మానవునికి గాని, దేవదూతకుగాని అధికారము లేదు. దేవుని అధికారముఅంతయు బైబిలునందు ఇమడ్చబడి యున్నందున క్రైస్తవులు దానిని బట్టియే నడచుకొన వలెను. బైబిలును చదువు వాడును, అందులో వ్రాయబడిన సంగతులను గైకొనువాడును ధన్యుడు అని ప్రకటన 1:3 చెప్పుచున్నది.

లేఖనములే సర్వసంపూర్ణములు అని దైవవేదము ఘోషించుచుండగా, అనేకులు దేవుడ నాకు కన్పించాడు, ప్రభువు నాతో మాట్లాడాడు అని చెప్పుచూ యుంటారు. వారు తమ్ముమను తాము మోసపుచ్చుకొనుటయే గాక, ఇక ఇతరులను కూడ మోసగించుచున్నారు. లేఖనములద్వారా తప్ప మరొక విధంగా దేవుడుమనతో ఈ ాడు మాట్లాడుట లేదు (హెబ్రీ 1:1,2). దేవుడు మీకొక విధముగను, నాకొక విధముగను తన చిత్తమును బయలుపరచిన యెడల, ఆయన పక్షపాతియగును. అయితే దేవుడు పక్షపాతికాడు అని ఆయన గ్రంథమే బోధించుచున్నది (అపొ.కా. 10:34). క్రైస్తవ్యములో మరికొందరు పెద్దల ఆచారములను బట్టి అనేక సంగతులను చేస్తు యుంటారు. అయితే "మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు... మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు" అని యేసు మత్తయి 15:6-9 లో చెప్పుచున్నాడు.

ఇహపరములందు సర్వాధికారము క్రీస్తుకు ఈయ్యబడియున్నది. గనుక ఆయన సంఘములో రకరకాల శాసనములను ప్రవేశపెట్టుటకు, మార్పులను తెచ్చుటకు అధికారమును ఒక మనుష్యునికి గాని, ఒక ప్రత్యేక సభకు గాని ఆయన ఇయ్యలేదు. అందువలన ఆయా మతశాఖలలో యున్న మీరు అనుసరించుచున్న బోధ, ఆచారములు ఏ అధికారమువలన వచ్చినవి ? అని ప్రశ్నించండి. మనుష్యులు ప్రవేశపెట్టిన సిద్ధాంతములు, ఆచారములు, నామములు మీరు కనుగొనిన యెడల తప్పక వాటిని తిరస్కరించండి. బైబిలునొద్దకు వచ్చి దేవుని వాక్యమేమి చెప్పుచున్నదో దానిని బట్టి నడుచుకొనండి. ఏలయనగా అంత్యదినమందు మానవకల్పిత సిద్ధాంతములు, ఆచారములను బట్టి గాక క్రీస్తు వాక్యమును బట్టి మనకు తీర్పు జరగును. యేసు ఇట్లు చెప్పుచున్నాడు: "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను

12:48). నీ పేరు జీవగ్రంథములో వ్రాయబడవలెనని కోరుచున్న యెడల బైబిలు గ్రంథమును తప్పక అనుసరించును (ప్రక 20:15).

- జాషువా గూటం.

# దూతలకంటే క్రీస్తు ఉన్నతుడు

## (Christ is Superior to Angels)

**(హెబ్రీ 1:1-14)**

క్రీస్తు పాత నిబంధన ప్రవక్తల కంటె ఉన్నతుడని హెబ్రీ పత్రిక మొదటి అధ్యాయము తెలియజేయుచున్నది. ఆయన దూతలకంటే ఉన్నతుడని కూడ బయలు పరచబడెను. దూతలు మహిమ గలవారే గాని దేవుని మహిమ అంతకంటే శ్రేష్టమైనది. క్రీస్తు దేవుని తత్వము యొక్క మూర్తి మంతమునై యున్నాడు. ఆయన మహిమ తేజోమయమైనది (హెబ్రీ 1:3).

నామములో క్రీస్తు ఉన్నతుడు. ఆయన దూతలకంటె ఎంతో శ్రేష్టమైన నామమును పొందెను. "కట్టడను నేను వివరించెదను. యెహోవా నాకీలాగు సెలవిచ్చెను. నీవు నా కుమారుడవు. నేడు నిన్ను కనియున్నాను" (కీర్తన 2:7). యేసును దేవుడు "నా కుమారుడని" పిలిచి ఆయన దైవత్వాన్ని ప్రకటించెను. "నేనతనికి తండ్రినై యుందును; అతడు నాకు కుమారుడై యుండును..." అని ముందుగనే ప్రకటింపబడెను. దూతలనుద్దేశించి దేవుడు ఎన్నడు ఈ మాటలు చెప్పలేదు (2సమూయేలు 7:14).

దూతలు ఆయనను ఆరాధింతురు గనుక ఆయన వారికంటే ఉన్నతుడు. "మరియు ఆయన భూలోకమునకు ఆదిసంభూతుని మరల రప్పించినప్పుడు దేవుని దూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని చెప్పుచున్నాడు" (హెబ్రీ 1:6). యేసేక్రీస్తని ఆరాధించని దూత యెవడును పరలోకములో నుండడు.

యేసు జన్మించగానే దూతలు ఆయనను ఆరాధించిరి (లూకా 2:13-14). వారాయనను ఆరాధిస్తూనే యున్నారు.

దూతలు వార్తావాహులు మాత్రమే గనుక ఆయన దూతలకంటే ఉన్నతుడు. దూతలు పరిచారము చేయుటకై పంపబడిన ఆత్మలు. "వీరందరు రక్షణయను స్వాస్థ్యము పొందబోవువారికి పరిచారము చేయుటకై పంపబడిన ఆత్మలు కారా ?" (హెబ్రీ 1:14). క్రీస్తు ఆత్మీయరాజు. ఆయన తన దూతలను పరిచారము చేయుటకై పంపును. దేవుని చిత్తమును జరిగించు దేవుని సేవకులు దూతలు. దూతలు తండ్రియైన దేవుని యొక్కయు, కుమారుడైన క్రీస్తు యొక్కయు పరిచారకులు. "...తన దూతలను వాయువులు గాను, తన సేవకులను అగ్ని జ్వాలలు గాను చేసుకొనువాడు అని తన దూతలను గూర్చి చెప్పుచున్నాడు గాని తన కుమారుని గూర్చియైతే-దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది; నీ రాజదండము న్యాయార్థమైనది... అని చెప్పుచున్నాడు" (హెబ్రీ 1:7-8).

అభిషేకము వలన క్రీస్తు దూతలకంటే శ్రేష్ఠుడు. "...నీవు నీతిని ప్రేమించి దుర్నీతిని ద్వేషించితివి. అందుచేత దేవుడు నీ దేవుడు నీతోడివారి కంటె నిన్ను హెచ్చించునట్లుగా ఆనంద తైలముతో అభిషేకించెను" (హెబ్రీ 1:9). యేసు అభిషిక్తుడు. ఆయన ప్రవక్త, ప్రధాన యాజకుడు, రాజుగా అభిషేకించబడెను. ఆయన తన వారికంటె ఉన్నతుడుగా అభిషేకించబడెను. ఆయన నమ్మకమైన సాక్షియు, మృతులలోనుండి ఆది సంభూతుడుగా లేచినవాడును, భూపతులకు అధిపతియునైన యేసుక్రీస్తు (ప్రక 1:5).

తండ్రియైన దేవుడు ఆయనను దేవుడు అని సంబోధించెను గనుక ఆయన శ్రేష్ఠుడు. "...గాని తన కుమారుని గూర్చియైతే-దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది; నీ రాజదండము న్యాయార్థమైనది" అని చెప్పెను (హెబ్రీ 1:8).

యిది కీర్తన 45:6లో చెప్పబడిన మాటయే. దేవుడే యేసును దేవుడని ప్రకటించి నప్పుడు ఆయన దేవుడే !

సృష్టివలన కూడ యేసు ఉన్నతుడని నిరూపింపబడెను. ఆయన మార్పులేని సృష్టికర్తయని చెప్పబడెను (హెబ్రీ 1:10-12). సృష్టికర్త గనుక పాలించే అధికారము ఆయన కలిగియున్నారు (యోహాను 1:1-4). ఆయన మధ్యవర్తి గనుక అట్టి అధికారము ఆయనకున్నది (1తిమోతి 2:15). ఆయన దేవుడే గనుక పాలించే అధికారము సహజంగా ఆయనకున్నది.

పరిచర్య చేయు దూతలను బట్టి ఆయన ఉన్నతుడు. "అయితే-నేను నీ శత్రువులను నీ పాదములకు పాదపీఠముగా చేయు వరకు నా కుడిపార్శ్వమున కూర్చుండుము అని దూతలలో ఎవని గూర్చియైన యెప్పుడైనా చెప్పెనా ? వీరందరు రక్షణ యను స్వాస్థ్యము పొందబోవు వారికి పరిచారము చేయుటకై పంపబడిన సేవకులైన ఆత్మలు కారా ?" (హెబ్రీ 1:13-14).

దూతలకు ఎన్నడు చెప్పని మాటలను దేవుడు యేసుకు చెప్పెను. యేసు దేవుడు, దూతలైతే పరిచారకులే. ఆయన దూతలకంటే శ్రేష్టుడు. ఆయన ఉన్నతుడు గనుక ఆయన చెప్పిన మాటలపై మనము జాగ్రత్త వహించాలి. నమ్మి బాప్తిస్మము పొందాలి అని ఆయన చెప్పిన మాటలకు నీవు లోబడితివా ? (మార్కు 16:16). క్రీస్తులో ఎదగాలి అని ఆయన చెప్పిన మాటలను ఆలకించావా ? (హెబ్రీ 5:12-14). ఆయన శ్రేష్టుడని నీవు నమ్మిన యెడల, ఆయనను ప్రేమించి ఆయనకు సేవచేయుము.

- చార్ల్స్ బాక్స్ (TVC)

11.

# క్రీస్తు యొక్క మరణము
## (The Death of Christ)

క్రీస్తు యొక్క జననమునకు ఈలోకం గొప్ప ప్రాముఖ్యత నిచ్చుచుంటే. ఆయన మరణమునకు బైబిలు అంతకంటే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చుచున్నది. ఆదిమ క్రైస్తవులు క్రీస్తుయొక్క మరణాన్ని జ్ఞాపకముంచుకొనుటకు ప్రతి ఆదివారమున కూడుకొని ప్రభురాత్రి భోజనంలో పాల్గొనేవారు (అపొ.కా. 20:7; 1కొరింథీ 11:26). మానవ చరిత్రలో క్రీస్తు యొక్క సిలువ కేంద్రబిందువై యున్నది. క్రీస్తు సిలువ వేయబడిన సందర్భములో జరిగిన సంగతులను మనం గమనిస్తే ఆయన మరణం యొక్క ప్రాముఖ్యత మనకు విశదమవుతాది.

దేవుని కుమారుడు ఏల మరణించవలసి వచ్చినది ? ఆయన ఎందుకు మరణించారు ? ఎట్లు మరణించారు ? ఆయన మరణమునుండి మనం యేమి నేర్చుకోగలము ? ఈ అంశములను ఇప్పుడు ధ్యానించ ప్రయత్నించెదము :

> "ఆయన తన సిలువ మోసికొని కపాల స్థలమను చోటికి వెళ్లెను. హెబ్రీ భాషలో దానికి గొల్గొతా అనిపేరు. అక్కడ ఈ వైపున ఒకనిని ఆ వైపున ఒకనిని మధ్యను యేసును ఉంచి ఆయనతో కూడ ఇద్దరిని సిలువ వేసిరి" (యోహాను 19:17-18).

## I. క్రీస్తు ఏల మరణించవలసివచ్చెను ?

రోమనుల క్రూరమైన ఈ మరణదండన అవుసరమా ? దీనికి మూడు లేఖన భాగములలో అవునని జవాబు మనకు దొరుకును.

**A. పాపక్షమాపణ** : మన పాపములు క్షమించబడాలంటే రక్తము అవుసరమని హెబ్రీ 9:22లో మనము చూడగలము. పాపములు క్షమించబడునట్లు

ఊట ఒకటి తెరువబడునని జెకర్యా ప్రవచించాడు. రోమా సైనికుడు క్రీస్తు యొక్క ప్రక్కలో బల్లెము పొడువగానే ఆ ఊట తెరువబడెను (యోహాను 19:34). లోక పాపములను మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్ల క్రీస్తే (యోహాను 1:29). తన రక్తమునందు ఆయన మన పాపములు కడిగెను (ప్రకటన 1:5). క్రీస్తు పస్కా బలియాయెను (1కొరింథీ 5:7). మన రక్షకుని ద్వారా మనం మరణమునుండి విమోచింపబడితిమి. గొల్గొతా దినము వరకు యూదుల చరిత్రలో ప్రాయశ్చితార్థ దినమే గొప్ప దినముగా ఎంచబడెను (లేవీ 16). ఏటేటా ప్రధాన యాజకుడు తన పాపముల కొరకు ప్రజల పాపముల కొరకు ప్రాయశ్చిత్తార్థ బలినర్పించి, వారి పాపములను ఒక మేకపై మోపి అరణ్యములో దానిని విడిచి పెట్టేవాడు. అయితే మన రక్షకుడు మరణించు వరకు ఎవడును పాప క్షమాపణ పొందలేదు (హెబ్రీ 9:15-17). పాప క్షమాపణ కొరకు క్రీస్తు మరణించవలసి వచ్చెను.

**B.** దేవుని నిత్య సంకల్పము : దేవుని అపరిమిత సత్యములను పరిమితి జ్ఞానముతో మనం అర్థము చేసికొనలేము. అవి మానవునికి బయలు పరచబడినను కూడ మానవుడు గ్రహించుకొనలేక పోవుచున్నాడు (ద్వితీయో 29:29). "నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకమునుండి దిగి వచ్చితిని" అని యేసు చెప్పెను (యోహాను 6:38). కుమారుని యెడల తండ్రి యొక్క అభీష్టము ఏమై యుండెను ? అది ఆయన మానవుల పాప క్షమాపణ నిమిత్తము బలిగా అర్పింపబడవలెననునదియే (1పేతురు 1:18-19).

స్త్రీ సంతానము అపవాది యొక్క తల చితుక నరకునని దేవుడు ఏదెను వనములో అపవాదితో చెప్పెను (ఆది.కా. 3:15). క్రీస్తు పాపరహిత జీవితమును జీవించి, సమాధినుండి తిరిగి లేచినప్పుడు ఈ వాగ్దానము నెరవేరెను (1కొరింథీ

15:56). తద్వారా మానవులపై అపవాది ప్రభావమును నిర్మూలించెను.

"ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23).

**C.** మానవుని దేవునితో సమాధాన పరచుట కొరకు : ఏదెనులో ఆదాము పాపము చేసినప్పుడు యెహోవా దేవుని నుండి మానవులు ఎడబాసిరి (యెషయా 59:1-22). సృష్టికర్తకు సృష్టముకు మధ్యనున్న పరిపూర్ణ సంబంధము తెగిపోయెను. క్రీస్తు మరణము వలన అతడు మరల దేవునితో ఏకమాయెను (ఎఫెసీ 2:16). మెస్సీయ ప్రవచనమును దానినెరవేర్పును దిగువ గమనించుము :

> "మన యతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా 53:5).

> "ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడిన యెడల సమాధాన పరచ బడిన వారమై ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింప బడుదుము" (రోమా 5:10).

మానవుడు పాపము వలన దేవునినుండి దూరమైపోయాడు. గనుక వానిని దేవునితో సమాధాన పరచు నిమిత్తము యేసు మరణించవలసి వచ్చెను.

## II. క్రీస్తు ఏల మరణించెను ?

ఈ దిగువ కారణముల మిశ్రమము వలన క్రీస్తు మరణించెను. అవి యేవనగా :

**A.** దేవుని ప్రేమ : "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8).

**B.** మానవుని బలహీనత : ఇస్కరియోతు యూదా ఘాతుకము, పేతురు బొంకడము, యూదా జనాంగము క్రీస్తును నిరాకరించడము, ఇత్యాది సంఘటనలన్నీ క్రీస్తు మరణానికి దారాతీసాయి.

**C.** పిలాతు పిరికితనము : నజరేయుడైన యేసులో అతడు ఏ తప్పిదమును కనుగొనలేకపోయినను పిలాతు ఆయనను మరణమునకప్పగించెను. నిజాయితీ కంటే రాజకీయ మనుగడనే అతడు కాంక్షించాడు.

**D.** క్రీస్తు యొక్క దీనత్వము : దేవుని కుమారుడు "మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:8). గెత్సమనేలో ఆయన నా చిత్తము కాదు నీ చిత్తమే సిద్ధించును గాక యనెను.

**E.** మనకు అత్యవుసరమైన రక్షణ : మానవ జాతియొక్క అధోగతియే కల్వరికి దారితీసింది. "నీతిమంతుడులేడు, ఒక్కడును లేడు" (రోమా 3:10). క్రీస్తుకు వేరై ఎవ్విధమైన నిరీక్షణ మానవునికి లేదు. ఆయన అనేకులకు ప్రతిగా విమోచన క్రియ ధనముగా తన ప్రాణము నిచ్చెను (మత్తయి 20:28).

ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణమును రుచి చూచెను (హెబ్రీ 2:9). "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము,నమ్మతగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై

యున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను" అని అందుకే పౌలు చెప్పెను (1తిమో 1:15).

## III. మన విమోచన కర్త ఎట్లు మరణించెను ?

మొదటిగా, ఆయన బహిరంగముగా మరణించెను. "ఇది యొక మూలను జరిగిన కార్యము కాదు" (అపో.కా. 26:26). పస్కా పండుగలో యేసు వధింప బడెను. ఆ పండుగ సందర్భములో ఇరవై లక్షలమంది హెబ్రీయులు యెరూషలేము లోను, పరిసర ప్రాంతములలోను యుండిరని చరిత్రకారులు చెప్పుదురు.

రెండవదిగా, గలలీయుడైన ఆయన ఉన్నత భావములతో మరణించెను. ఇతరుల సంకుచిత భావమును బట్టి దేవుని చిత్తము జరుగకుండా ఆయన ఒక్క మారు కూడా అడ్డురాలేదు. నీవు క్రీస్తువా ? అని యడిగినప్పుడు ఆయన నీవన్నట్టే యనెను. సిలువ మీద వ్రేలాడుచున్న ఆయన ఘనతను చూచి శతాధిపతి, "నిజముగా ఈయన దేవుని కుమారుడని" చెప్పెను (మత్తయి 27:54).

మూడవదిగా క్రీస్తు ప్రతిగా మరణించెను; అంటే ఆయన యితరులకు ప్రతిగా మరణించెను. 2కొరింథీ 5:14లో అందరి కొరకు ఒకడు మృతి బొందెనని చెప్పబడినది. "ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను" అని 1పేతురు 2:24లో చెప్పబడినది. పాపము లేని ఆయనను దేవుడు మన కోసము పాపముగా చేసెను (2కొరింథీ 5:21).

నాల్గవదిగా, మన రక్షకుడు బాధననుభవిస్తు మరణించెను. సిలువవేయబడక ముందు రోమీయుల కొరడా దెబ్బలతోనే కొందరు చనిపోతారు. సిలువ యొక్క బరువు బహుభారమైనది. అంతేగాక సిలువపై పండుకొనబెట్టి కాళ్లలోను, చేతులలోను మేకులు దిగగొట్టిన తరువాత సిలువను దాని గోతిలో నిలబెట్టుదురు. అట్టి బాధ భరింపరానిది, ఆయనను సైనికులు హింసించిరి, జన సమూహములు

హేళన చేసిరి. తలపైనున్న ముండ్ల కిరీటమునుండి, కాళ్లు చేతులలో కొట్టబడిన మేకులనుండి రక్తముకారెను. ఆయన బహు బాధనొందెను.

చివరిగా ఆయన ఏకాకిగా మరణించెను. ఆయనను ఎరుగనని పేతురు ముమ్మారు బొంకెను. మిగతా అపొస్తలులు అటు యిటు చెదరిపోయిరి, లేదా దూరమునుండి ఆయనను వెంబడించిరి. కొందరు స్త్రీలు దగ్గరే యుండి యేడ్చుచుండిరి. నికోదేము, అరిమతయి యోసేపు ఆయన భూస్థాపన నిమిత్తము శరీరమును సిద్ధపరచిరి. అయినను మానవ జాతికి అంతమేలు చేసిన మూర్తి ఏకాంతముగానే సిలువపై వ్రేలాడెను. ఆ మ్రానునుండి, "నా దేవా, నా దేవా నన్నేల చేయి విడిచితివి ?" యని ఆయన బిగ్గరగా అరచెను. పడిపోయిన మానవుని నుండి దేవుడు తన ముఖము త్రిప్పుకొనెను. ఆ ఘడియలోనే మన విమోచన నిరీక్షణ ఉద్భవించెను.

> "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడైయుండియు, మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2కొరింథీ 8:9).

## IV. క్రీస్తు మరణమునుండి మనము నేర్చుకొనవలసిన పాఠములు :

సిలువనుండి మనము నాలుగు గొప్ప పాఠములు నేర్చుకొనగలము. ప్రతి అంశము ప్రాధమికమైనదే. ఈ సత్యములను అందరు గ్రహించినట్లయితే ఈనాడు క్రైస్తవ్యములో చీలికలుండవు. కల్వరిలో ప్రభువుయొక్క త్యాగ ఫలితములను జాగ్రత్తగా గమనించుము.

**A.** ధర్మశాస్త్రము కొట్టివేయబడెను : మత్తయి 26:28లో క్రీస్తు రక్తము ద్వారా క్రొత్తనిబంధన ప్రవేశపెట్టబడెనని మనము చదువగలము. క్రీస్తు అను

వేరొకని చేరుటకై మనము ధర్మశాస్త్రము విషయము మృతులమైతిమి యని రోమా 7వ అధ్యాయములో చదువగలము. నీతి ధర్మశాస్త్రము వలన నైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ ప్రయోజనమే యని పౌలు గలతీ 2:21లో బోధించెను. క్రొత్తనిబంధనకు క్రీస్తు మధ్యవర్తి యని, అది ఆయన మరణించు వరకు అమలులోనికి రాలేదని హెబ్రీ పత్రిక లేఖకుడు మరల చెప్పుచున్నాడు. గనుక సిలువలో మన రక్షకుడు ధర్మశాస్త్రమును ఎత్తివేసెను. ఇప్పుడు మనము మన ప్రభువు యొక్క కడవరి నిబంధనలో యున్నాము (హెబ్రీ 8:6; 9:16; 10:10).

దీనిని మనం అర్ధము చేసికొంటే సిలువమీదనున్న దొంగను గూర్చిన ప్రశ్న కూడ అర్థమగును. క్రీస్తు తన క్రొత్త నిబంధన రక్తమును చిందింపక ముందు జీవించి మరణించెను. మనము ఆయన మరణానంతరము జీవించుచున్నాము. మనము క్రొత్తనిబంధన కాలములో యున్నాము; సిలువపైనున్న దొంగ అయితే పాతనిబంధనకు బద్ధుడు. యేసు భూమిపై బ్రదికియుండగా పాపములు క్షమించు అధికారము ఆయన కలిగియుండెను (మత్తయి 9:6). అయితే ఆయన చనిపోయిన తరువాత ఆయన శాసనములు క్రొత్తనిబంధనలో బయలుపరచ బడెను. ఆయన రక్తముచే ముద్రించబడిన క్షమాపణ షరతులు ఎన్నడు మార్చ బడవు. యుక్త వయస్సు వచ్చిన వారందరు సువార్తను విని విశ్వసించాలి (మార్కు 16:16), పాపముల విషయమై మారుమనస్సు పొందాలి (లూకా 24:47), మరియు నీటిలో ముంచడము పొందాలి (అపొ.కా. 2:38; 22:16). ఈ నియమము ఈ యుగాంతము వరకు అమలులో యుండును (మత్తయి 28:18-20).

**B.** ఆయన సంఘము స్థాపించబడెను : మత్తయి 16:18లో మన ప్రభువు తన సంఘమును స్థాపింతునని వాగ్దానము చేసెను. మరియు పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని చెప్పెను.

యేసును చంపుట ద్వారా ఆయన ప్రభావము నాశనమగునని ఆయన శత్రువులు తలంచారు. అయితే సమాధినుండి మన విమోచకుడు తిరిగి లేచారు. సంఘము స్థాపించబడుటకు ఆయన అపొస్తులులకు శక్తి అనుగ్రహించెను. యేసు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తు నాడు క్రీస్తు సంఘము స్థాపించ బడెను. ఆనాడు ఇంచుమించు మూడువేలమంది సంఘముతో చేర్చబడిరి. మరియు రక్షింపబడిన వారిని ప్రభువు అనుదినము సంఘముతో చేర్చుచుండెను (అపొ.కా. 2:47). క్రీస్తు మరణమునుండి తిరిగి లేచుట ద్వారా సంఘమునకు శిరస్సు ఆయెనని ఎఫెసీ 1:20-23లో మనము తెలిసికొనగలము.

**C.** మన పునరుత్థాన నిరీక్షణ : చనిపోయిన లాజరును తిరిగి బ్రదికించినప్పుడు మన ప్రభువు గొప్ప ప్రకటనను చేసెను: "పునరుత్థానమును జీవమును నేనే. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. బ్రతికి నాయందు విశ్వాసముంచువాడు ఎన్నటికిని చనిపోడు" (యోహాను 11:25).

మృతులలోనుండి ప్రథమ ఫలముగా క్రీస్తు లేచెనని 1కొరింథీ 15లో పౌలు చెప్పెను.

యేసు మరల వచ్చునప్పుడు సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని బయటికి వచ్చెదరు అని యోహాను తెలియజేసాడు (యోహాను 5:28-29). ఆదిమ క్రైస్తవులు తిరిగి లేపబడి ప్రభువుతో యుందుమను మాటలతో ఒకరినొకరు ఆదరించుకొనిరి (1థెస్స 4:13-18). యేసు పునరుత్థానుడై మనకంటె ముందుగా మన పక్షమున పరలోకములో ప్రవేశించెను (హెబ్రీ 6:20), గనుక మనమును ప్రవేశింతుము. అట్టి ప్రశస్త నిరీక్షణ కొరకు దేవునికి స్తోత్రములు.

**D.** బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యత, ఆత్మీయ సౌందర్యము : క్రీస్తు యొక్క మరణమును గూర్చి తెలిసికొనునప్పుడు బాప్తిస్మము అనే అంశము దగ్గరకు

అది సహజముగా మనలను నడిపించును. రోమా 6:1-5లో క్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానములు ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు ఆత్మీయముగా చిత్రీకరించబడుట మనము చూడగలము. పాపిరైనవాడు పాపముల విషయమై మరణించును, నీటిలో సమాధి చేయబడును, నూతన జీవితం జీవించుట కొరకు దానినుండి తిరిగిలేచును. కొలస్స 2:12 కూడ యిదే భావమును వ్యక్త పరచుచున్నది. గనుక బాప్తిస్మమును చులకన చేయరాదు. గొప్ప ఆత్మీయ భావమును వ్యక్తపర్చు దేవుని ఆజ్ఞ అది. క్రీస్తులో యున్న దీవెనలు పొందుటకు గాను (ఎఫెసీ 1:3), బాప్తిస్మము ఒకని క్రీస్తులో ప్రవేశింప జేయును (గలతీ 3:27).

మనము యేసుక్రీస్తు యొక్క మరణమును ధ్యానించిన యెడల గ్రహించుకో గలిగే కొన్ని పాఠములు యివి. ఈ దీవెనలను మనము పొందగలిగిన యెడల నిజంగా మనము ఎన్నటికి చనిపోము. అట్టివారిపై రెండవ మరణమునకు శక్తియుండదు.

- జానీ రామ్సే.

## ఎస్తేరు
## (Esther)

ప్రతీ యుగము అసాధారణ వ్యక్తులను గూర్చి చెప్పుచున్నది. ఎస్తేరు కూడా అసాధారణమైన వ్యక్తి. పారశీక దేశమునకు రాణి అగుటకు పూర్వము ఆమెకు వ్యతిరేకముగా నాలుగు ముఖ్య విషయములు జరిగినవి.

1. మొదటిగా ఆమె తన బాల్యమందే తల్లిదండ్రులను పోగొట్టుకొన్నది. ఆ విధముగా పసితనములోనే తల్లిదండ్రులను పోగొట్టుకొనుట చాలా విచారకరమైన సంగతి.

తన పిన తండ్రి కుమారుడైన మొర్దెకై ప్రేమకొరకు కృతజ్ఞత కలిగియున్నప్పటికి, అది స్వంత కుటుంబములో పెరుగుటలో గల ఆనందమునకు సాటిరాదు.

2. రెండవదిగా ఆమె విగ్రహారాధికులున్న వాతావరణములో పెంచబడినది. ఎస్తేరు పారశీక దేశములో ఉండుటకు కారణమేమనగా ఆమె పూర్వీకులు విగ్రహారాధన చేయుటవలన దేవుడు యూదా వారిని తీర్పులోనికి తెచ్చుటకు వారిని బబులోనీయులకు అప్పగించెను. వారు తరువాత పారశీకులచే జయింపబడిరి. హామాను యొక్క ఆలోచనకు రాజు స్పందించుటలో ఎస్తేరు జీవించిన పారశీక వాతావరణము కనబడుచున్నది. హామాను యూదా జనాంగమునంతటిని నాశనము చేయుటకు ఆలోచన చెప్పగా రాజు సంశయించకుండా ఈలాగు ఆజ్ఞాపించెను. "నీ దృష్టికి ఏవి అనుకూలమో అది ఆ జనులకు చేయుము" (ఎస్తేరు 3:11). వెంటనే తాఖీదులు సంస్థానములన్నింటికి పంపబడెను. "యౌవనులనేమి, వృద్ధులనేమి, శిశువులనేమి స్త్రీలనేమి యూదులందరిని ఒక్క దినమందే బొత్తిగా నిర్మూలము చేసి వారి సొమ్ము కొల్లపుచ్చుకొమ్మని తాఖీదులు అంచెవారి చేత రాజ్య సంస్థానములన్నిటికి పంపబడెను" (ఎస్తె 3:13). అంతట హామానును రాజును విందుకు కూర్చుండిరి (ఎస్తేరు 3:15).

3. మూడవదిగా ఆమె సాధారణ జీవితమును పొందలేదు. ప్రతీ యూదా కుమార్తె యొక్క గురి ఏమనగా వివాహము, కుటుంబము. తన స్వంత గృహము కల్గి యుండుట. ఎస్తేరు అటువంటి ఆనందదాయకమైన స్త్రీ త్వము కొరకు కలలు కనియుండవచ్చు అనుటలో సందేహము లేదు. దీనికి బదులుగా ఆమె రాజు అంతఃపురమునకు తేబడినది. విగ్రహారాధికులైన సంఘములో, ఏ కోరికలు లేని స్త్రీ రాజు యొక్క అంతఃపురంములో ఏకాంతవాసము చేయుట సాధారణమైన విషయము కాదు. రాణియై యుండి కూడా, ఒకానొక సమయములో మొర్దెకై ఎస్తేరుకు కబురు పంపినప్పుడు "నేటికి ముప్పది దినములనుండి అహశ్వరోషుచే పిలువబడలేదు, (ఎస్తేరు 4:11) అని తెలియజేసెను.

**4.** నాల్గవదిగా అమె తన యొక్క కన్యాత్వమును విగ్రహారాధికుడైన రాజుక. అర్పించుటకు బలవంతము చేయబడినది. ఎస్తేరులాంటి యౌవనస్థురాలికి కన్యాత్వము అనునది గొప్ప సంపద. తన కిష్టమైన వ్యక్తితో వివాహమయ్యేంత వరకు, కన్యాత్వమనునది తన జీవితములో తాను సంరంక్షించు కోవలసిన విషయము. దానికి బదులుగా ఆమె తన ఇంటనుండి ఒక వస్తువువలె కొనిపోబడి సరిగా చూడని, ప్రేమలేని స్పందనలేని అహాశ్వరోషుకు ఇవ్వబడినది.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తి ఎలాగుండునని తలంచుచున్నారు? ఆమె జీవితములో మోసపోయానని భావిస్తూ లోకములోని అందరి ఎడల కోపము కల్గి, కఠిన మనస్సు కలిగి, అయిష్టముగా ఉంటూ ప్రతీ విషయములో ప్రతీవారితో విరుద్ధ భావాన్ని కల్గియుండును.

అంతేకాక ఆమె మరొక ప్రక్క తీవ్రమైన శోధనలను ఎదుర్కొనెను. ప్రపంచములో శక్తివంతమైన దేశమునకు రాణి అయ్యెను. రాజ్యములో సగము మట్టుకైనను ఇస్తాను అని రాజు చెప్పెను (ఎస్తే 5:3). హామాను చనిపోయిన తరువాత అతని ఆస్థి అంతయు ఎస్తేరునకు ఇవ్వబడెను (ఎస్తే 8:1). మానవుడు ఎల్లప్పుడు దేనికొరకై పోరాడుతాడో అట్టి బలము, ఐశ్వర్యము ఇహలోక సంబంధమైన కీర్తి మొదలగు వినాశకర శక్తులతో ఎస్తేరు అనుదినము జీవిస్తుయుండెను. ఇలాంటి పరిస్థితులలో ఉన్న ఏ వ్యక్తి అయినా సరే "గర్వము, ఆత్మస్తుతి, అహంకారము" మొదలగు లక్షణాలను కల్గియుండును గాని ఈ లక్షణాలకు బదులుగా ఎస్తేరు నకు గల శ్రేష్టమైన లక్షణాలను గమనించండి.

1. మొదటిగా ఆమె వినయము మరియు లోబడే ఆత్మను కల్గియున్నది :- షూషను కోటలో ఎన్నిక చేయబడిన కన్యకలసందర్భ సమావేశ పరిచారు. వారిలో నుండి ఒకరిని అహాశ్వరోషు పారశీక దేశమునకు రాణిగా ఎన్ను కుంటాడు. ఈ కన్యకలు చాలా అందమైనవారు. వారిలో చాలామంది.

ఉన్నత కుటుంబాల నుండి వచ్చినవారు. మంచి తిండి, పోషణ గలవారను టలో సందేహములేదు. అలాంటి స్త్రీలు అహంభావము, అహంకారము మరియు అధికారముతో అడుగు స్వభావాన్ని కల్గియుంటారు. "కనుక అంతఃపురం నుండి రాజు ఇంటిలోనికి వెళ్లవలసిన సమయమున ఆమె ఏమేమి కోరునో అట్టిది ఆమెకు ఈయబడుటకద్దు " (ఎస్తేరు 2:13). "కాని రాజునొద్దకు వెళ్లుటకు వంతు వచ్చినపుడు హెగే నిర్ణయించిన అలంకారము గాక ఆమె మరి ఏమియు కోరలేదు (ఎస్తేరు 2:15).

2. రెండవదిగా ఆమె సుందరమైన వ్యక్తిత్వము గలది :- ఎస్తేరును చూచిన వారందరికి ఆమె యందు దయ పుట్టెను (ఎస్తేరు 2:15). వివేకము కల్గియున్నది. నైతిక విలువలను గౌరవించుట, ఏ పని చేయుటలోనైనను వివేకమును కల్గియుండాలి.

3. ఆమె గౌరవప్రదమైన మరియు విధేయత కల్గిన మనస్సును ప్రదర్శించి నది :- ఆమె రాజ్య కిరీటమును పొందిన తరువాత కూడా మొర్దెకై యొక్క పోషణలో ఉన్నట్టుగానే ఇప్పుడును అతని మాటకు లోబడుచుండెను (ఎస్తేరు 2:20). ఆమె పారశీకదేశపు, మహారాణి. ఆమెకు బలము, కీర్తి, సంపదలు ఉన్నవి. ఇట్టి పరిస్థితులలో మొర్దెకైని మరచిపోవుట ఎంతో సులభము. లేక అతనిని అలక్ష్యము చేయవచ్చు. కాని ఎస్తేరును గూర్చి ఆలాగు చెప్పబడలేదు.

4. నాల్గవదిగా తన జానంగము కొరకు తన జీవితాన్ని అర్పించుటకు ఇష్టపడినది. "నేను రాజునొద్దకు ప్రవేశించుదును నేను నశించిన నశించెదను" (ఎస్తేరు 4:16). తన యొక్క శక్తిని స్థితిని, సంపదను, కీర్తిని మరి విశేషముగా తన జీవితాన్ని అర్పించుటకు ఇష్టపడినది.

ఒక వ్యక్తి తన వ్యక్తిగత విచారములనుండి నెమ్మది పొందుటకు, విగ్రహారాధికులైన పరిసరాలలో హెచ్చింపబడుటకు, అమితమైన కష్టాలనుండి విజయము సాధించుటకు మరియు లోకమునకు ఆశీర్వాదకరముగా ఉండుటకు ఏస్తేరు ఒక సజీవ నిదర్శనము.

- ఫ్రేంక్ పెప్పర్ (VOT)


ఉచితం! ఉచితం! ఉచితం!

మీ ఇంటనే ఉండి బైబిలును చదవండి.

యేసుక్రీస్తును ఆయన బోధనలను తెలుసుకోండి.

మేమిచ్చు ఉచిత బేసిక్ బైబిలు కోర్సులో చేరండి.

పోస్టు ద్వారా ఆ పాఠములను పూర్తిచేసి

ఒక బైబిలును ఉచితముగా పొందండి.

ఈరోజే మాకు వ్రాయండి.

SATYA VANI

P.O. BOX. 80,

KAKINADA - 533 001 A.P.

# Declaration ( See Rule 3)

| | |
|---|---|
| Titile of the News paper | : **Satya Vakku** |
| Language | : Telugu |
| Name & Address of the Publisher | : Joshua Gootam<br>10-4-33/1, SeshagiriRao St.,<br>Kakinada - 533 004 |
| Nationality | : Indian |
| Name of the Printer with address | : Joshua Gootam<br>10-4-33/1,SeshagiriRao St.,<br>Kakinada - 533 004 |
| Place of printing with address | : Satya Vani<br>Church of Christ, 7-9-35,<br>Samba murthy st.,<br>Kakinada - 533 001 |
| Place of Publishing | : Satya Vani<br>Church of Christ, 7-9-35,<br>Samba murthy st,<br>Kakinada - 533 001 |
| Name of the Editor | : Joshua Gooatm ( Indian)<br>10-4-33/1,SeshagiriRao St.<br>Kakinada - 533 004 |

I, Joshua Gootam declare that Particulars in respect of the News-paper above are true to the best of my Knowldge and belief.

Sd -
Joshua Gootam

అత్యంత ఘనముగా జరిగెను. దేవగుప్తంలోను, పరిసర ప్రాంతములలోను గత 30 సంవత్సరములుగా సోదరులు యన్. ఏలియా గారు క్రీస్తు కొరకు నిర్విరామ కృషి చేయుచు గొప్ప ఫలితములను సాధించుచున్నారు. నిర్ణయింపబడిన సమయమునకు పలు గ్రామములనుండి, పట్టణములనుండి అనేకులైన సువార్తికులు కూడివచ్చిరి. స్థానికులతో కూడ క్రీస్తుసంఘ ఆవరణము వందలాది ప్రజలతో నిండియుండగా, "యేసుక్రీస్తు దేవుని కుమారుడని యేల నమ్మవలెను?" అను అంశము చర్చించబడెను.

సదస్సు సోదరులు వి.జె. ఫ్రాన్సిస్ (అమలాపురం) గారి ప్రార్థనతో ఆరంభమాయెను. సోదరులు బూల చిరంజీవి (పల్లంకుర్రు), యు. స్టాలిన్ (గుత్తినదీవి), కుసుమ ప్రసాద్ (ఆచంట), వి. రాజకుమార్ (అమలాపురం), వి.వి. రాఘవులు (కొత్తలంక), జి. షడ్రక్ (పాలకొల్లు), డి. చిరంజీవి (బండార్లంక) గార్లు పైఅంశమును చక్కగా లేఖనములనుండి విశ్లేషించిరి. సదస్సుకు జాషువా గూటంగారు అధ్యక్షత వహించి తగు సమయమందు తగు రీతిగ వాక్యము నుండి గొప్ప సత్యములను వెలికితీసి చూపించిరి.

యేసుక్రీస్తు అసాధారణమైన వ్యక్తి. ఆయన జన్మ అసాధారణం. ఆయన జీవితం అసాధారణం. మరణం అసాధారణం, పునరుత్థానము కూడా అసాధారణం. యేసు జన్మించిన రీతిగ ఏ మానవుడు ఎన్నడు జన్మించలేదు. దేవుని శక్తి వలన కన్యయైన మరియకు ఆయన జన్మించెను. ఆయనను గూర్చి కొన్నివేల లేక వందల సంవత్సరముల ముందే ప్రవచనములు చెప్పబడెను. అవి ఆయన జీవితంలో అక్షరాల నెరవేరెను. ఆయన చేసిన బోధలు ఆశ్చర్యములు, అవి నేడు మానవాళికంతటికీ ఆదర్శములే. ఆయన పొందిన సిలువ మరణం అసాధారణం. ఏ నేరము చేయకయే ఆయన సిలువపై బలియాయెను. ఆయన పునరుత్థానము - ఆయన జీవిత కాలములో చేసిన అద్భుతములకు అద్భుతము. అందువలన, "యేసుక్రీస్తు శరీరమును బట్టి దావీదు సంతానముగాను, మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతోను నిరూపింపబడెను." (రోమా 1:7).

2000 సంవత్సరము మార్చినెల మొదటి తేదీ బుధవారం ఆలమూరు మండలం పెదపళ్లలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయము సోదరులు రోయస్‌గారు, గుమ్మడి ఇశ్రాయేలు గారు, జాషువా గారు కలసి రిబ్బను కత్తిరించుట ద్వారా ప్రతిష్ట చేయబడెను. సోదరులు రోయస్‌గారు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము, వారి సువార్తికులు ఇశ్రాయేలు గారు శ్రమించి మంచి ఆలయమును రోయస్ గారి యొక్కయు జాషువా గూటం వారి యొక్కయు సహకారముతో నిర్మాణం చేసిరి. ఆలయ నిర్మాణ కార్యక్రమములో సహకరించిన వారందరినీ జాషువా గారు, ఇశ్రాయేలు గారు అభినందించిరి. కార్యక్రమము అనంతరం వచ్చిన వారందరికీ స్థానిక సంఘము మంచి విందునేర్పాటు చేసిరి. ఒక స్త్రీ సువార్తకు లోబడెను. పెదపెళ్లలోని క్రీస్తుసంఘము దినదినాభివృద్ధి చెందులాగున ప్రార్థింతము.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001.

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam